సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



శతాబ్ది వేడుకల్లో అపూర్వ కలయిక

జెడ్పీ హైస్కూల్ నుంచి ప్రభుత్వ హైస్కూల్‌గా.. జూనియర్ కళాశాలగా మారి.. వందేళ్లు పూర్తి చేసుకున్న ఆ పాఠశాల శతాబ్ది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.


8లో



కూటమి నేతలకు చిత్రాడలో చుక్కెదురు

'నచ్చిన చోట రోడ్లు వేసుకుంటున్నారు.. మీ సొంత సొమ్మా?' అంటూ కూటమి నేతలకు చిత్రాడ గ్రామస్తులు చుక్కలు చూపించారు.

సాగుకు 8,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,600, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,400 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.45 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నిరుద్యోగుల జీవితాలతో ఆటలొద్దు

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు శిరీష్

అమలాపురం టౌన్: ఎనిమిది నెలల పాలనలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలాడుతోందని, వారిని నట్టేట ముంచుతోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్ ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా గ్రూప్ –2 పరీక్షల రాసే అభ్యర్థుల విషయంలో సైతం కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతపై ఆది నుంచి వహిస్తున్న నిర్లక్ష్యమే వహించిదని ఆరోపించారు. ఈ మేరకు శిరీష్ అమలాపురంలో ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. గ్రూప్–2 అభ్యర్థులకు రోస్టర్ విధానాన్ని సరిచేసి పరీక్షలు నిర్వహించాల్సిన ప్రభుత్వం పరీక్షలు వాయిదా వేస్తామని చెబుతూ చివరి నిమిషం వరకూ డైలమాలో పడేడయం సరికాదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, విద్యా మంత్రి ఈ పరీక్షల నిర్వహణలో కల్లబొల్లి కబుర్లు చెబుతూ చివరి నిమిషంలో ఆ నెపాన్ని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై నెట్టేసి అర్ధంతరంగా ఆదివారం పరీక్ష పెట్టడం వారిని అయోమయంలో పడేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదు సరి కదా కనీసం పోటీ పరీక్షలైనా సక్రమంగా నిర్వహించకుండా నిరుద్యోగ యువత భవితను ఈ ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రతీ ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తానని చెప్పిన ప్రభుత్వం అదీ అమలు చేయకుండా నిరుద్యోగ యువత జీవితాలను అగమ్య గోచరం చేస్తోందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి సరైన సమయంలో గుణపాఠం చెప్పేందుకు నిరుద్యోగ యువత కాచుకుని ఉందని శిరీష్ స్పష్టం చేశారు.

సత్యదేవుని సన్నిధిలో భక్తజన వాహిని



ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ

అన్నవరం: సత్యదేవుని సన్నిధికి ఆదివారం వేలాదిగా భక్తులు పోటెత్తారు. సుమారు 50 వేల మందికి పైగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి, ఆదివారం తెల్లవారుజామున రత్నగిరిపై, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులు, వారి బంధుమిత్రులు సత్యదేవుని దర్శించేందుకు రత్నగిరికి తరలివచ్చారు. దీనికి తోడు మాఘ బహుళ దశమి పర్వదినం కావడంతో పెద్ద సంఖ్యలో ఇతర భక్తులు కూడా తరలి వచ్చారు. దీంతో ఆలయంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. ఉదయం 9 గంటల వరకూ ఓ మాదిరిగా ఉన్న రద్దీ తరువాత ఒక్కసారిగా పెరిగిపోయింది. సాయంత్రం వరకూ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. రద్దీ కారణంగా అంతరాలయ దర్శనాలను మధ్యాహ్నం వరకూ నిలిపివేశారు. మొత్తం 50 వేల మంది భక్తులు రత్నగిరికి వచ్చారని అధికారులు తెలిపారు. దేవస్థానానికి రూ.50 లక్షలు పైగా ఆదాయం సమకూరింది. సత్యదేవుని వ్రతాలు సుమారు 4 వేలు జరిగాయి. స్వామివారి నిత్య కల్యాణంలో 50 మంది పాల్గొన్నారు.

అంబులెన్స్‌లకు మంగళం

- ఆగిపోయిన 1962 మొబైల్ అంబులెన్స్‌లు
- కూటమి ప్రభుత్వంలో పశువైద్యానికి కష్టకాలం
- జిల్లాలో 7 వాహనాల నిలిపివేత
- 108 మాదిరిగా పశువుల కోసం ప్రారంభించిన జగన్ ప్రభుత్వం
- ప్రభుత్వ తీరుపై పాడి రైతుల ఆగ్రహం

అమలాపురం రూరల్: 1962 హెల్ప్ లైన్ మూగబోయింది. మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. మారుమూల పల్లెల్లో సైతం అందించే విశిష్ట పశువైద్య సేవలు నిలిచిపోయాయి. ఎన్నో అరుదైన, కష్టసాధ్యమైన శస్త్రచికిత్సలు చేసి మూగజీవాలకు ప్రాణదానం చేసిన మొబైల్ అంబులెన్స్‌లు రోడ్డెక్కడం లేదు. వారం రోజుల క్రితం అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 7 అంబులెన్స్‌లు నిలిచిపోగా రేపో మాపో మిగిలిన 7 అంబులెన్స్‌లు కూడా ఆగిపోనున్నాయి.

దేశంలోనే ఎక్కడా లేని విధంగా...

దేశంలోనే తొలిసారిగా దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు ప్రవేశపెట్టి పేదలకు ఎంతో సాంత్వన చేకూర్చారు. అదే స్ఫూర్తితో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి మూగజీవాల కోసం 2022 సంవత్సరంలో మే 19 తేదీన మొబైల్ అంబులెన్స్‌లు తీసుకువచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేసిన ఈ అంబులెన్సులు మంచి ఫలితాలు ఇవ్వడంతో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వీటిని సమకూర్చారు. నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల విలువ చేసే మందులు సైతం ఉచితంగా అందించారు. అర్హత కలిగిన పశువైద్యులు ఒక పేరావిట్, డ్రైవర్‌ను నియమించారు. 1962 ట్రోల్ నంబరు ఏర్పాటు చేశారు. రైతుల నుంచి ఫోన్ వచ్చిన వెంటనే 108 మాదిరిగానే మారుమూల ప్రాంతాలకు 1962 అంబులెన్సులు వెళ్లి రైతు ఇంటి వద్ద మూగజీవాలకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. మూగజీవాలకు ప్రమాద స్థితిలో ఉన్నప్పుడు అంబులెన్స్ ద్వారా సమీప పశువుల ఆసుపత్రికి తీసుకువెళ్లి పశుసంవర్ధక శాఖ డాక్టర్లు, ఏడీల సహకారంతో శస్త్రచికిత్సలు అందించి ప్రాణం కాపాడేవారు.



1962 అంబులెన్స్‌లో సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

కక్ష గట్టి కూటమి ప్రభుత్వం నిలిపివేత

ఉన్నత ఆశయంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. కాంట్రాక్టు ముగిసిందనే నెపంతో 7 అంబులెన్స్‌లను ఈ నెల 16 నుంచి నిలిపివేసింది. మరికొన్ని రోజుల్లో మిగిలిన 7 అంబులెన్స్‌లను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తూ చేస్తున్నారు. వీటిని జీవీకే సంస్థ నిర్వహించేది. కాంట్రాక్టర్ గడువు ముగిసిందని కుంటి సాకుతో నిలిపివేశారు. ఒక్కసారిగా 1962 అంబులెన్స్ సేవలను నిలిపివేయడంతో రైతులు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు. మూగజీవాల వైద్య సేవలకు అంతరాయం ఏర్పడుతోందని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క 1962 అంబులెన్స్‌ల్లో పనిచేసిన ఉద్యోగులు పరిస్థితి అగమ్య గోచరంగా తయారయింది. కొత్త సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంటే తమ పరిస్థితి ఏమిటని ఉద్యోగులు వాపోతున్నాడు. కూటమి సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై ఆదోళన చెందుతున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2019 లెక్కల ప్రకారం జిల్లాలో పశువుల వివరాలు

ఆవులు	75,460
గేదెలు	1,53, 542
ఎద్దులు	57, 031
మేకలు	23.518
గొర్రెలు	25 ,111
పందులు	6.268
కుక్కలు	20,890
అంబులెన్స్	14
ఉద్యోగులు	46

ఉద్యోగుల నిరసన

మా కుటుంబాలు రోడ్డున పడకుండా ఉద్యోగాలు ఇవ్వాలని 1962 అంబులెన్స్ ఉద్యోగులు కోరుతున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పనిచేస్తున్న 1962 మొబైల్ అంబులెన్స్‌లలో పనిచేసే ఉద్యోగులు గురువారం అమలాపురంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా పశువైద్య అధికారి వెంకట్రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ముందస్తు సమాచారం లేకుండా నోటీసు ఇవ్వకుండా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం లేకుండానే అంబులెన్స్‌లు నిలిపివేయడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ తమను మళ్లీ విధుల్లోకి తీసుకునేలా చూడాలని కోరారు జీవీకెఈఎమ్.ఆర్ఐ. సంస్థ ద్వారా 2022 నుంచి విధులు నిర్వర్తిస్తే ఇప్పుడు తొలగించడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. డాక్టర్, పేరావిట్, డ్రైవర్‌లుగా పని చేస్తున్నామని మాకు న్యాయం చేయాలని కోరారు.

మాకు ఉద్యోగాలు ఇవ్వాలి



సంస్థలో మూడు సంవత్సరాలుగా పేరావిట్‌గా పనిచేస్తూ వేలాది పశువులకు సేవలు అందించాను. అధికారులు, ప్రభుత్వం స్పందించి ఉద్యోగులను విధులలోనికి తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం అన్యాయంగా తొలగించడం వల్ల మా కుటుంబాలు రోడ్డున పడతాయి.

– మోహన్, పేరావిట్, అమలాపురం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంబులెన్స్ ఉద్యోగులు

అయినవిల్లిలో భక్తుల సందడి



స్వామివారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. స్వామివారి పంచామృతాభిషేకాల్లో మూడు జంటలు పాల్గొన్నాయి. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 62 మంది, శ్రీ లక్ష్మీగణపతి హోమంలో 25 జంటలు, స్వామివారి గరిక పూజలో ఒక జంట పాల్గొన్నారు. ముగ్గురు భక్తులు స్వామికి ఉండ్రాళ్ల పూజలు జరిపారు. స్వామి వారి సన్నిధిలో 77 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు, 15 మంది చిన్నారులకు అన్న ప్రాశనలు, 14 మందికి తులాభారం, ఒకరికి నామకరణ చేశారు. స్వామికి 12 మంది తలనీలాలు సమర్పించారు. 48 నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. 4,100 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.5,72,525 ఆదాయం లభించినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పదవులను బాధ్యతగా నిర్వహిద్దాం

– వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్య ప్రకాష్

మలికిపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన పార్టీ పదవులను బాధ్యతగా నిర్వహిద్దామని, నూతనంగా నియమితులయిన వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాష్ పేర్కొన్నారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుని తొలిసారిగా ఆదివారం మలికిపురంలో పార్టీ కార్యాలయంలో నియోజక వర్గ పార్టీ కేడర్‌తో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పార్టీలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. వచ్చే నాలుగేళ్లలో శ్రమించి జిల్లాలో అత్యధిక స్థానాలలో పార్టీ విజయం సాధించేలా కృషి చేద్దామన్నారు. ఇందుకోసం పార్టీ కేడర్ అంతా శ్రమించాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ఎంతో ఉత్తమ పాలన అందించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాలన అస్తవ్యస్థం చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనన్నారు. కూటమి ప్రభుత్వం పాలనలో అవినీతి విలయ తాండవం చేస్తోందన్నారు. కూటమి పాలనపై ఎనిమిది నెలల్లోనే ప్రజలు విరక్తి చెందారన్నారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో జిల్లాలో పార్టీ యువజన విభాగం మరింత బలోపేతం అయి వచ్చే ఎన్నికల నాటికి విజయ తీరాలకు చేరుద్దామన్నారు. జగన్ నేతృత్వంలో అంతా కలిసిమెలసి పనిచేసి ముందుకు సాగుదామన్నారు. నాయకులు కేఎస్ఎన్ రాజు, జంపన బుజ్జిరాజు, కంచర్ల శేఖర్, పాటి శివకుమార్, బొలిశెట్టి భగవాన్, కుసుమ చంద్రశేఖర్, గుబ్బల మనోహర్, ఈద రవిరెడ్డి, గుబ్బల వీర వెంకట సత్యనారాయణ, గుర్రం జాషువా, తాడి సహదేవ్, నామన మణికంఠ పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సూర్య ప్రకాష్‌ను శాలువాలతో సన్మానించి అభినందించారు.



పిల్లి సూర్య ప్రకాష్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

అందరికీ ఆమోదయోగ్యంగా కేంద్ర బడ్జెట్

అమలాపురంలో మేధావుల సమావేశం

అమలాపురం రూరల్: ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని అమలాపురంలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన మేధావుల సమావేశం తెలిపింది. అమలాపురం ప్రెస్ క్లబ్ హాల్‌లో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై మేధావుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.డి.విల్సన్ మాట్లాడుతూ కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా దేశ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్ అని అన్నారు. ఈ బడ్జెట్ ద్వారా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. యువతను పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చేయటానికి ఎంఎస్ఎంఈలకు 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించారు. వాళ్లకు ఇచ్చే రుణాలు రూ.ఐదు కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచే ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. మహిళల అభివృద్ధికి సంబంధించి అనేక పథకాలు ప్రవేశపెట్టారు. రైతు కిసాన్ పథకాన్ని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారన్నారు. మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, జిల్లా ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏడిద దొరబాబు, వివిధ వ్యాపార సముదాయాల అధ్యక్షులు నల్లా పవన్ కుమార్, గోకరకొండ హరిబాబు, కంచిపల్లి అబ్బులు, మేడిచర్ల త్రినాథ్, వంటెద్దు బాబు, డాక్టర్ వీరా ధన్వంతరీ, మణికుమారి, డాక్టర్లు, లాయర్లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి విల్సన్

లోవలో భక్తుల సందడి



తలుపులమ్మ తల్లిని దర్శించేందుకు మెట్ల మార్గంలో వెళుతున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన 7 వేల మంది భక్తులు క్యూ లైన్ల ద్వారా అమ్మవారిని దర్శించుకున్నట్లు ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,21,365, పూజా టికెట్లకు రూ.75,520, కేశఖండన శాలకు రూ.9,840, వాహన పూజలకు రూ.2,810, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.60,032, విరాళాలు రూ.62,280 కలిపి మొత్తం రూ.3,31,847 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు వేళాయె

- మార్చి ఒకటి నుంచి 20 వరకూ నిర్వహణ
- జిల్లావ్యాప్తంగా 40 కేంద్రాలు
- హాజరుకానున్న 27,312 మంది విద్యార్థులు

రాయవరం: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధం అవుతోంది. మార్చి 1న ఫస్టియర్ పరీక్షలతో ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలు మార్చి 20న సెకండియర్ పరీక్షలతో ముగియనున్నాయి. జిల్లా మొత్తం మీద 27,312 మంది విద్యార్థులు 40 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. ప్రశ్నపత్రాలను 14 స్టోరేజీ పాయింట్లకు తరలించే ప్రక్రియ త్వరలోనే చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి మూడు సెట్ల పరీక్ష ప్రశ్నపత్రాలు చేరుకున్నాయి. వీటిని అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పోలీసు బందోబస్తుతో భద్రపరిచారు. పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉంటుంది. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఈసారి జంబ్లింగ్ విధానంలోనే

ఈసారి కూడా పరీక్షలు జంబ్లింగ్ విధానంలోనే నిర్వహిస్తున్నారు. ఇంటర్ ఫస్టియర్ 11,023 జనరల్ విద్యార్థులు, 2,408 మంది వొకేషనల్, ఇంటర్ సెకండియర్ జనరల్ విద్యార్థులు 11,235 మంది, వొకేషనల్ విద్యార్థులు 2,646 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.



కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏమైనా సమస్యలుంటే కంట్రోలు రూమ్‌లో ఏర్పాటు చేసిన 9550335191 నంబరుకు ఫోన్ చేయవచ్చు. ఈ సంవత్సరం కలెక్టరేట్లో కూడా ప్రత్యేకంగా ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నారు.

హాల్ టికెట్లు డౌన్ లోడ్

విద్యార్థుల హాల్ టికెట్లను నేరుగా డౌన్ లోడ్ చేసుకునే అవకాశాన్ని ఇంటర్మీడియెట్ బోర్డ్ కల్పించింది. విద్యార్థి పేరు, హాల్ టికెట్ నంబరును టైప్ చేస్తే పరీక్ష కేంద్రం వివరాలు తెలుస్తాయి. ఇప్పటికే హాల్ టికెట్లను ప్రిన్సిపాల్స్ విద్యార్థులకు అందజేస్తున్నారు. ఇంటర్మీడియేట్ బోర్డు ఏర్పాటు చేసిన 95523 00009 వాట్సాప్ నంబరుకు ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఏర్పాటు చేసింది. మొదటగా వాట్సాప్ నంబరుకు హాయ్ అని ఇంగ్లిషులో టైప్ చేసి పంపించాలి. వెంటనే ప్రభుత్వ సర్వీసులు డిస్‌ప్లే అవ్వగానే, విద్యాశాఖను ఎంపిక చేసుకోవాలి. అందులో విద్యార్థి ఆధార్ నంబరు లేదా రోల్ నంబరును టైప్ చేయాలి. తర్వాత విద్యార్థి పుట్టిన తేదీ, నెల, సంవత్సరం టైప్ చేయాలి. కాసేపట్లో విద్యార్థి హాల్ టికెట్ అదే వాట్సాప్‌కు పీడీఎఫ్ ఫార్మేట్‌లో డౌన్‌లోడ్ అవుతుంది.

దివ్యాంగులకు సదుపాయాలు

దృష్టిలోపం ఉన్న వారు పరీక్ష రాసేందుకు సహాయకుడిని నియమించుకోవచ్చు. వీరికి జంబ్లింగ్ నుంచి మినహాయింపు ఉంది. పరీక్ష రాసేందుకు 30 నిమిషాల అదనపు సమయం ఇస్తారు. దివ్యాంగ శాతాన్ని బట్టి విద్యార్థికి ఆయా సబ్జెక్టుల్లో ఉత్తీర్ణతా మార్కులను తగ్గిస్తారు. వినికిడి లోపం ఉంటే పై మినహాయింపులతో పాటు ఒక లాంగ్వేజ్‌లో పార్ట్–1, పార్ట్–2 నుంచి మినహాయింపు ఇస్తారు. ఒకేషనల్ విద్యార్థులకు ఆంగ్లంలో చదివే కమ్యూనికేషన్ స్కిల్స్ నుంచి మినహాయిస్తారు. శారీరక వైకల్యం ఉంటే రెండు చేతులు లేని వారికి స్క్రైబ్‌ను ఇస్తారు. డిస్లెక్సియా లోపం ఉన్న వారికి గంట అదనపు సమయం ఇస్తారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఎక్కడా అవకతవకలకు అవకాశం లేకుండా పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించం. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే దాని తీవ్రతను బట్టి 8 పరీక్షల వరకూ డిబార్ చేస్తాం. ఉదయం 6.45కు రేడియోలో వచ్చే ప్రాంతీయ వార్తల్లో చెప్పే సెట్ నంబర్ ప్రశ్నాపత్రాన్ని పోలీస్ స్టేషన్ నుంచి ఉదయం 8.3 0గంటలకు పరీక్షా కేంద్రానికి తరలిస్తారు.

– వనుము సోమశేఖరరావు ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ అధికారి, అమలాపురం

జిల్లా నుంచి ఇంటర్ రాసే విద్యార్థులు	: 27,312
ప్రథమ సంవత్సరం విద్యార్థులు	–13, 431
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	– 13,881
పరీక్షా కేంద్రాలు:	40
సమస్యాత్మక పరీక్షా కేంద్రాలు:	01
ఫ్లయింగ్ స్క్వాడ్స్	– 4
సిట్టింగ్ స్క్వాడ్స్	– 3

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

- సీసీ కెమెరాల నిఘా నడుమ పరీక్షల నిర్వహణ
- జిల్లా పరీక్షల కమిటీ సమావేశంలో డీఐఈవో సోమశేఖరరావు వెల్లడి

అమలాపురం టౌన్: మార్చి 1 నుంచి 20వ తేదీ వరకూ జరగనున్న ఇంటర్మీడియెట్ థియరీ పరీక్షలు నిర్వహణ అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సంసిద్ధమై ఉండాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (డీఐఈవో) వనుము సోమశేఖరరావు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ కమిటీ సమావేశంలో డీఐఈవో మాట్లాడారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో నిర్దేశించిన 40 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటున్న దృష్ట్యా పోలీసు పహరా ఉంటుందని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు, ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లు వాడకూడదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రం వద్ద చీఫ్ సూపరింటెండెంట్ మాత్రం ఇంటర్మీడియెట్ విద్యా మండలి సరఫరా చేసిన సాధారణ ఫోన్‌ను పరీక్షకులకు సంబంధించిన సమాచారం కోసం వాడవచ్చని సూచించారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులైన అధికారులకు పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను డీఐఈవో తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు వై.లక్ష్మణరావు, ఎం.రామారావు, కె.శ్రీనివాసరావు, బల్క్ ఇన్‌చార్జి డి.శ్రీనివాసరావు, జిల్లా జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో సోమశేఖరరావు

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లి గ్రామంలో తల్లిదండ్రులు లేని ఒక యువకుడు తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గూడూరి వెంకట సతీష్ (28) శివాలయం సమీపంలోని చెరువు వద్ద షెడ్డు నిర్మించుకుని నివసిస్తున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిని ఆదివారం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు, బంధువులు లేకపోవడంతో వీఆర్వో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ అతడు నివసిస్తున్న షెడ్డును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఎవరైనా బంధువులు ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

నాలుగు రేషన్ బియ్యం లారీల సీజ్


పట్టుకున్న రేషన్ బియ్యం లోడుతో ఉన్న లారీ

కాకినాడ సిటీ: కాకినాడ పోర్టు సమీపంలోని బొంబే కట్ట గేట్ వద్ద 92 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం లోడ్‌తో ఉన్న నాలుగు లారీలను పట్టుకొని సీజ్ చేసి 6ఏ కేసు బుక్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన పోర్టు సమీపంలో బొంబేకట్ట గేటు వద్ద నాలుగు వాహనాల్లో తరలిస్తున్న 92 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేసి 6ఏ కేసులు బుక్ చేసి, స్టాక్‌ను గోడౌన్‌కు తరలించినట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆ ప్రకటనలో వివరించారు.

పట్టుబడ్డ బియ్యం లారీలు

కాకినాడ క్రైం: కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముంబయి కాటా సమీపంలో నాలుగు లారీలు బియ్యం లోడుతో పట్టుబడ్డాయని పోర్టు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పట్టుబడ్డ లోడు పీడీఎస్ బియ్యంగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్‌లైస్ అధికారులు ఈ బియ్యం నమూనాలను సేకరించి తనిఖీలకు పంపారన్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శతాబ్ది వేడుకల్లో అపూర్వ కలయిక

- నాటి విషయాలను నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు
- గురువులు, సీనియర్ విద్యార్థులకు సత్కారాలు


సైన్స్ టీచరు భాస్కరరావును సత్కరించిన పూర్వవిద్యార్థులు

సామర్లకోట: జిల్లా పరిషత్తు హైస్కూల్ నుంచి ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మారి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పాఠశాల శతాబ్ది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1984 ఏర్పాటు చేసిన పాఠశాలలో చదివిన విద్యార్థుల నుంచి ఇప్పటి వరకు ఉన్న విద్యార్థులతో కలిపి అపూర్వ సమేళనం ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు పలకరింపులు, అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ వయసును సైతం మర్చిపోయారు. తాము చదువు కున్న తరగతి గదుల వద్ద సెల్ఫీలు తీసుకొని అప్పటి ముచ్చట్లను గుర్తు చేసుకున్నారు. ఎవరికి వారే ఆయా బ్యాచ్‌లుగా విడిపోయి కబుర్లతో గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు పసల పద్మరాఘవరావు అధ్యక్షత వహిస్తూ పాఠశాల స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పూర్వ విద్యార్థులతో కలిసి శతాబ్ది వేడుకలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయడంతో పాటు అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ మేరకు ఇటీవల కళాశాలకు వచ్చిన జిల్లా కలెక్టరు షణ్మోహన్, ఎమ్మెల్యే రాజప్పలకు కళాశాల పరిస్థితిని వివరించామన్నారు.

పూర్వ విద్యార్థులను కలుసుకోవడం ఆనందం

పాఠశాల శతాబ్ది వేడుకల్లో పాల్గొనడం, పూర్వపు విద్యార్థులను కలుసుకొవడం అప్పటి విషయాలను గుర్తు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని డాక్టరు చందలాడ పద్మనాభం అన్నారు. సామర్లకోటలో చదివిన 12వ తరగతి పునాదితో డాక్టరుగా గుర్తింపు తెచ్చుకొవడం ఆనందంగా ఉందన్నారు. సీనియర్ విద్యార్థి దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ విద్య వ్యాపారంగా మారిందని, ప్రతీ ఒక్కరి ఆలోచనలోను మార్పు రావాలన్నారు. సమాజం పట్ల బాధ్యత పెరగాలని పిలుపు నిచ్చారు. పాఠశాలకు 30 ఎకరాల స్థలం ఇచ్చిన దాత పిఠాపురం మహారాజా రావుజగపతి సూర్యారావు బహదూర్ కుమారుడు రాజారావు వెంకట మంగపతి రామరత్నారావు మాట్లాడుతూ పాఠశాల శతాబ్ది వేడుకలను తనను ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. డాక్టరు పసల సత్యానందరావు, కళాశాల ప్రిన్సిపాల్ లీలాశ్రీదేవిలు ప్రసంగించారు. పాఠశాలలో పని చేసి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులను, సీనియర్ విద్యార్థులను పూర్వ విద్యార్థి సంఘం తరపున సత్కరించారు. అంతకు ముందు సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు.

ఇది మరచిపోలేని సంఘటన



1968–71 వరకు చదవుకున్న పాఠశాల శతాబ్ది వేడుకల్లో పాల్గొని స్నేహితులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. బెంగళూరులో బయోలజీ చేసి, అమెరికాలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేసిన సమయంలో పూర్వ విద్యార్థుల కలయిక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసి తన స్నేహితులను ఎప్పుడు , ఎప్పుడు కలుసుకుందామా అనే ఆత్రుతతో సామర్లకోట వచ్చాను. ఈ సంఘటన జీవితంలో మరిచిపోలేను.

– జీవీ ప్రసాద్, పూర్వ విద్యార్థి, అమెరికా

స్నేహితులను కలుసుకోవడానికి వచ్చా



నాతో చదువున్న స్నేహితులను కలుసుకుందాం అనుకున్నా. ఎవరూ లేరు. అబ్బాయిలు మాత్రమే ఉన్నారు. 1956–57లో 10వ తరగతి చదువుకున్నాను. అప్పటి స్మృత్తులు నెమరు వేసుకున్నాను.

– వద్దిపర్తి రామలక్ష్మి, పూర్వ విద్యార్థి, హైదరాబాద్


మాట్లాడుతున్న పూర్వవిద్యార్థి సంఘ అధ్యక్షుడు పద్మరాఘవరావు


పూర్వ విద్యార్థి డాక్టరు చందలాడ అనంతపద్మనాభానికి సత్కారం


పిఠాపురం మహారాజా కుమారుడు వెంకట మంగపతి రామరత్నరావును సత్కరించిన పూర్వ విద్యార్థులు

కూటమి నేతలకు చిత్రాడలో చుక్కెదురు


రోడ్డు పనులు నిలిపివేయాలంటూ ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- రోడ్ల నిర్మాణాలను అడ్డుకున్న స్థానికులు
- వారికి నచ్చిన చోట రోడ్లు వేసుకుంటున్నారని ఆగ్రహం

పిఠాపురం: 'మీకు నచ్చిన చోట రోడ్లు వేసుకుంటున్నారు మీ సొంత సొమ్మా' అంటూ పిఠాపురం మండలం చిత్రాడలో కూటమి నేతలకు చుక్కలు చూపించారు గ్రామస్తులు. అవసరం లేని చోట రోడ్లు వేస్తున్నారంటూ కూటమి నేతలను నిలదీశారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో గ్రామానికి రూ.36 లక్షల వ్యయంతో నాలుగు రోడ్లు మంజూరు కావడంతో ఆదివారం చిత్రాడ ఈబీసీ కాలనీలో రెండు రోడ్ల నిర్మాణ పనులు అధికారులు ప్రారంభించారు. వాటిలో ఒక రోడ్డు జనసేన నేత చుట్టాలున్న చోట, మరో రోడ్డు టీడీపీ నేత చుట్టాలున్న చోట ప్రారంభించారని ఆరోపిస్తూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈబీసీ కాలనీలో లోతట్టు ప్రాంతాలు రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటుంటే మెరకగా ఉన్న ప్రాంతాల్లో కూటమి నేతల బంధువుల ఇళ్లు, పొలాలు ఉన్న చోట రోడ్లు నిర్మిస్తున్నారంటు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. నేతల ఇళ్లకు రోడ్లు వేసుకోవడానికి వారి సొంత సొమ్మా అంటూ కూటమి నేతలను నిలదీశారు. అవసరమైన చోట రోడ్లు వేశాకే మీకు నచ్చిన చోట వేసుకోండి అప్పటి వరకు పనులు జరగనివ్వబోమని ఆందోళన చేపట్టి పనులు అడ్డుకున్నారు. సమాధానం చెప్పే వరకు కదలనిచ్చేది లేదని గ్రామస్తులు కూటమి నేతలను నిలబెట్టేశారు. గ్రామంలో పల్లపు ప్రాంతాలు, మురికి ప్రాంతాల్లో ముందుగా రోడ్లు వేయాల్సి ఉండగా మెరక ప్రాంతాల్లో వేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో కూటమి నేతలు చేసేదేమీ లేక పోలీసులకు సమాచారం ఇచ్చి నాయకులు అక్కడి నుంచి ఉడాయించారు. పోలీసులు వచ్చి గ్రామస్తులను చెదరగొట్టారు. రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిపివేశారు.

ఓఎన్జీసీ ఆధ్వర్యంలో సైక్లోథాన్


కాకినాడలో ఓఎన్జీసీ ఆధ్వర్యంలో సాగిన సైక్లోథాన్


రాజమహేంద్రవరంలో సైక్లోథాన్‌ను ప్రారంభిస్తున్న గెయిల్ జనరల్ మేనేజర్ కుమార్

ప్రత్యామ్నాయ వనరులు వినియోగించాలని పిలుపు

కాకినాడ రూరల్: అంతరించిపోతున్న సంప్రదాయ ఇంధన వనరులను సంరక్షించేందుకు ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలనే లక్ష్యంతో 'సాక్ష్యం' పేరిట ఓఎన్జీసీ ఆధ్వర్యంలో కాకినాడలో ఆదివారం సైక్లోథాన్‌ను నిర్వహించించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలోని ఓఎన్జీసీ హెచ్‌టీపీ కార్యాలయం వద్ద కార్యక్రమాన్ని ఈస్టర్న్ ఆఫ్ షోర్ ఎసెట్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ప్రభల్ సేన్ గుప్తా, అనుపమ్ సక్సేనా ప్రారంభించారు. గోదావరి సైక్లింగ్ క్లబ్, కాకినాడ సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులు, ఓఎన్జీసీ అధికారులు, సిబ్బంది, మహిళలు, చిన్నారులు సైక్లోథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రమణయ్యపేట నుంచి సర్పవరం జంక్షన్, బోట్‌క్లబ్, నాగమల్లితోట, జేఎన్‌టీయూకే మీదుగా భానుగుడి వరకు సైక్లోథాన్ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఈడీలు ప్రభల్ సేన్ గుప్తా, అనుపమ్ సక్సేనా మాట్లాడుతూ ఇంధన అవసరాల కోసం పునరుత్పాదక ఇంధన వనరులను వియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయ ఇంధన వనరుల వినియోగం తగ్గించి భావి తరాలకు ఇందన వనరులు అందించే కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి సాక్ష్యం కో ఆర్డినేటరు రఫీ, చీఫ్ కో ఆర్డినేటరు వాసుదేవన్ బాలాజీ ధన్యవాదాలు తెలియజేశారు.

అవగాహన కోసమే

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చమురు, గ్యాస్ పరిరక్షణ గురించి అవగాహన కల్పించడానికే సైక్లోథాన్ నిర్వహించినట్లు గెయిల్ ఇండియా లిమిటెడ్ జనరల్ మేనేజర్ వైఏ కుమార్ అన్నారు.

ఆదివారం ఉదయం రాజమహేంద్రవరం గెయిల్ ఇండియా లిమిటెడ్ కేజీ బేసిన్ ఆధ్వర్యంలో సాక్ష్యం 2025 సందర్భంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సైక్లోథాన్ నిర్వహించారు. ఈ సైక్లోథాన్‌ను గెయిల్ జనరల్ మేనేజర్ వైఏ కుమార్, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణమూర్తి ప్రారంభించారు. చమురు, గ్యాస్ సంరక్షణ ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించారు. గెయిల్ సీనియర్ అధికారులు, విద్యార్థులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


కబడ్డీ టోర్నీని ప్రారంభిస్తున్న ఎంపీపీ తోట రవి

కిర్లంపూడి: మండలంలోని వేలంకలో ఉమానీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని గండే చినతమ్మన్న మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్వహించే టోర్నమెంట్‌లో 9 కబడ్డీ జట్లు పాల్గొన్నాయి. కోర్టులో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. టోర్నమెంట్‌లో గెలిపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలుతో పాటు ప్రతి జట్టుకు షీల్డ్స్ అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంపీపీ తోట రవి, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచి శ్రీకాంత్, కాకినాడ జిల్లా సెక్రటరీ కె.శ్రీనివాస్, అధ్యక్షుడు లంబ, సర్పంచ్ రాయుడు స్వామి, చదరం చంటిబాబు, కాళ్ల వెంకటేశ్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

పెళ్లి పెద్దలకు 111 రకాలతో ప్రత్యేక విందు


రకాలతో ఏర్పాటు చేసిన తేనేటి విందు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలికి చెందిన ఇంద్రజాలికుడు శ్యామ్ జాదూగర్ తనయుడు లండన్ ఫిజియోథెరపిస్ట్ మోహిత్ కృష్ణ వివాహం బండారులంకకు చెందిన ఉప్పుగంటి శ్రీధర్ కుమార్తె ఫిజియోథెరపిస్ట్ సాయి సీతతో మార్చి 12 జరుగుతున్న సందర్భంగా పెళ్లికూతురుకు సంబంధించిన పెళ్లి పెద్దలు పెండ్లి కొడుకుకి పెళ్లి కార్డు ఇవ్వడానికి వచ్చిన సందర్భంగా దక్షిణ అమెరికాకు చెందిన ఎల్లో పుచ్చకాయ నుంచి మలేషియా మామిడిపండు వంటి 111 రకాల దేశ విదేశాలకు చెందిన పండ్లు, స్వీట్స్‌తో తేనేటి విందును ఏర్పాటు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మేజర్ డ్రైయిన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెద్దాపురం: మద్యం మత్తులోనో? లేక ప్రమాదవశాత్తునో గుర్తు తెలియని వ్యక్తి మేజర్ డ్రైయిన్‌లో పడి మృతి చెందిన ఘటన ఆదివారం పెద్దాపురం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక కుమ్మరవీధి మేజర్ డ్రైయిన్‌లో సుమారు 50 నుంచి 55 ఏళ్ల వ్యక్తి మృతదేహం తేలింది.

స్థానికులు గమనించి పెద్దాపురం పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ మౌనిక ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వాసుపత్రి మార్చురీ రూమ్‌కి తరలించారు. మృతుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మౌనిక తెలిపారు. వివరాలు తెలిసిన వారు 94409 04846 నంబర్‌కు తెలిపాలని ఆమె కోరారు.

మెడికల్ షాపు క్యాష్ కౌంటర్‌లోని రూ. లక్ష చోరీ

సినీ ఫక్కీలో బైక్‌పై పారిపోయిన ఇద్దరు యువకులు


బైక్‌పై పారిపోతున్న దొంగలు (సీసీ టీవీ ఫుటేజ్)

పి.గన్నవరం: స్థానిక మెయిన్‌రోడ్డులో ఆదివారం మందుల షాపు వద్ద సరుకులు కొనుగోలు చేస్తున్నట్టు నటించి క్యాష్ కౌంటర్‌లో సుమారు లక్ష రూపాయల నగదుతో ఉన్న బ్యాగ్‌ను ఇద్దరు యువకులు దొంగిలించి బైక్‌పై పారిపోయారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటనతో షాపు యజమాని ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పోతురాజు స్వామిగుడి ఎదురుగా తోలేటి రాంబాబు గణేష్ మెడికల్ షాపును నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పల్సర్ బైకుపై ఇద్దరు యువకులు వచ్చి షాపు వద్ద ఆగారు. ఒకడు బైక్‌పై ఉన్నాడు. మరొక యువకుడు షాపు యజమానిని డైపర్స్ కావాలని అడిగాడు. ఈ క్రమంలో తన వద్ద రూ.1,400ల విలువైన పది, ఇరవై రూపాయల నోట్లు ఉన్నాయి, వాటిని తీసుకుని పెద్ద నోట్లు ఇస్తారా అని అడిగాడు. వాటిని లెక్క చేసే సరికి రూ.1,200 మాత్రమే ఉండటంతో దానికి సరిపడా రాంబాబు పెద్దనోట్లు ఇచ్చారు. అర్జంటుగా డైపర్స్ ఇవ్వాలని అగంతకుడు కోరాడు. వాటిని షాపు యజమాని తీసి ఇచ్చేలోగా.. క్యాష్ కౌంటర్‌లోని సుమారు లక్ష రూపాయల నగదు ఉన్న బ్యాగును తీసుకుని బైక్‌పై ఉడాయించారు. వారిద్దరూ రావులపాలెం వైపు పారిపోయినట్టు గుర్తించారు. దీంతో షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ వివరించారు.

ఉల్లాసంగా ఆలిండియా హాకీ పోటీలు


ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలలో క్రీడాకారుల జోరు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆలిండియా సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా క్రీడామండలి పర్యవేక్షణలో కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. పురుషుల విభాగంలో హిమాచల్ సెక్టార్, కేరళ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హిమాచల్ సెక్టార్ గెలిచింది. తెలంగాణ సెక్టార్, మహారాష్ట్ర సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్టార్ , ఒడిశా సెక్టార్, ఉత్తరాఖండ్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిశా సెక్టార్, ఆర్బీస్ చెన్నై, ఆర్బీస్ చండీఘర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్బీఎస్ చెన్నై విజయం సాధించాయి. సెంట్రల్ సెక్టార్, ఆంధ్రప్రదేశ్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్టార్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్టార్, మధ్యప్రదేశ్ సెక్టార్, కేరళ సెక్టార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ సెక్టార్ గెలుపొందాయి. ఆదివారం నిర్వహించిన మ్యాచ్‌లను ధరణి కన్‌స్ట్రక్షన్స్ అధినేత రమణరావు అతిథిగా విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, కాకినాడ ఆర్‌డీఓ మల్లిబాబు, హాకీ సంఘ ప్రతినిధి రవిరాజు పర్యవేక్షించారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

రూ.2.15 లక్షల విలువైన ఆభరణాల అపహరణ


కొవ్వూరులో చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పట్టణ సీఐ విశ్వం

కొవ్వూరు: పట్టణంలో వేగి వారి చావిడి వీధిలో కాపెల్లి గనిరాజు అనే ఉపాధ్యాయుడి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. శనివారం రాత్రి ఇంటికి తాళాలు వేసి ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి నిడదవోలులో వివాహ వేడుకకు వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం వచ్చేసరికి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూస్తే బీరువా తాళాలు పగులకొట్టి దానిలో ఉన్న వస్తువులు, దుస్తులు చెల్లచెదురుగా మంచంపై పడవేసి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. సుమారు రూ.2.15లక్షల విలువైన 115 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుని పోయినట్లు బాధితుడు గనిరాజు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. సీఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీము వేలి ముద్రలు సేకరిస్తోంది.

పెయింట్లు అమ్మేసిన ఉద్యోగిపై కేసు

కొవ్వూరు: పట్టణ శివారున జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఏషియన్ పెయింట్స్ గోదాములో రూ.17 లక్షల విలువైన పెయింట్స్‌ను అమ్ముకున్న భార్గవ్ అనే ఉద్యోగి పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. రెండేళ్ల నుంచి భార్గవ్ ఇక్కడ ఈ అక్రమ వ్యవహారం సాగిస్తున్నట్లు తెలిపారు. నేరం రుజువు కావడంతో అతన్ని ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఏషియన్ పెయింట్స్ గోదావరి అధికారి నవీన్ ప్రకటించారు. నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, మరో 17 మందికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.లక్షా 70 వేలు జరిమానా విధిస్తూ మూడవ ఏజేఎఫ్‌సీ జడ్జి సి.రమ్య తీర్పునిచ్చారు. ఆ వివరాలను ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. జిల్లా ఎస్పీ డి.నరసింహాకిశోర్ ఆదేశాల మేరకు నగరం పరిధిలో రోడ్డు యాక్సిడెంట్లను తగ్గించాలనే లక్ష్యంతో ట్రాఫిక్ పోలీసులు ఈ డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న 18 మందిని కోర్టు ముందు హాజరుపర్చారు. వారిలో ఒకరికి జైలు శిక్ష, మిగతా వారికి జరిమానా విధించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260